క్లుప్తంగా

బీఆర్‌ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం



జనగామ: బీఆర్‌ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశం గెలుపు కోరుతూ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపు మేరకు ఆదివారం పట్టణంలోని 6వ వార్డులో తెలంగాణ ఉద్యమ నాయకురాలు గంగాభవాని, వార్డు అధ్యక్షుడు ఆంజనేయులు, భిక్షపతి, కొత్తపల్లి వెంకన్న, ప్రణయ్, దుర్గ తదితరులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. 29వ వార్డులో తెలంగాణ దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పంతులు ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారంలో వార్డు అధ్యక్షుడు కావడి కిరణ్, ప్రధాన కార్యదర్శి పుట్టా రామకృష్ణ, చల్ల శివ, టొకిర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ సమావేశం

స్టేషన్‌ఘన్‌పూర్: వరంగల్ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాల బూత్‌కమిటీలు, ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని సోమవారం డివిజన్ కేంద్రంలో నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక సిరిపురం గార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే సమావేశానికి ముఖ్య అతిథులుగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, వరంగల్‌పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్ హాజరవుతున్నారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల ఆత్మీయ సమ్మేళనం నేడు(సోమవారం) మండల కేంద్రంలోని శ్రీనిధి గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు బొడిగం చెంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశం గెలుపు కోసం నిర్వహించే సమ్మేళనానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరవుతున్నారని చెప్పారు. ఉదయం 12:30 గంటలకు నిర్వహించే సమ్మేళనానికి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

లింగాలఘణపురం: మండలంలోని నేలపోగుల మాజీ సర్పంచ్ దూసరి గణపతి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు కలిసి ఉపసర్పంచ్ అవుల ఎల్లమ్మ సంతకం ఫోర్జరీ చేసి నిధులు దుర్వినియోగం చేశారని వీరిపైచట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ నర్సయ్య ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో కలెక్టర్, డీపీఓ, ఎంపీడీఓలకు ఫిర్యాదు చేసినా విచారణ జరిపి చర్యలు తీసుకోలేదని, దీంతో కోర్టును ఆశ్రయించగా వీరిపై కోర్టు రెఫర్ కేసు నమోదు అయ్యిందని, విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎర్తింగ్ రాకుండా చర్యలు



జఫర్‌గఢ్: మండలంలోని ఓబులాపూర్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో ఉన్న మగ్దుంతండాలో విద్యుత్ సరఫరాలో ఎర్తింగ్ సమస్య రాకుండా సిబ్బంది ఆదివారం నివారణ చర్యలను చేపట్టారు. ఇందులో భాగంగా విద్యుత్ స్తంభాల వద్ద ఎర్త్ కుండీల్లో వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని పట్టే కార్యక్రమాన్ని విద్యుత్ సిబ్బంది చేపట్టారు. వేసవిలో ఎర్తింగ్ సమస్య రాకుండా ట్యాంకర్ ద్వారా కుండీల్లో నీళ్లను నింపుతున్నట్లు సిబ్బంది తెలిపారు.

కాంగ్రెస్‌తోనే సమగ్రాభివృద్ధి సాధ్యం



రఘునాథపల్లి: మాట్లాడుతున్న రాంబాబు



స్టేషన్‌ఘన్‌పూర్: ప్రచారంలో నాయకులు



పాలకుర్తి: మాట్లాడుతున్న రమేశ్



జఫర్‌గఢ్: మాట్లాడుతున్న రాపర్తి సోమయ్య



కొడకండ్ల: మొండ్రాయిలో బొట్టుపెట్టి ప్రచారం చేస్తున్న నాయకులు

రఘునాథపల్లి: కాంగ్రెస్‌తోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ నేత, మాజీ జెడ్పీటీసీ మారుజోడు రాంబాబు అన్నారు. ఆదివారం మండలంలోని అశ్వరావుపల్లిలో కడియం కావ్యను గెలిపించాలని గడప గడపకు బొట్టు పెట్టే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో కావ్యకు భారీ మెజార్టీ అందించాలని ఆయన పిలుపునిచ్చారు. మండల సమన్వయ కమిటీ సభ్యుడు మారుజోడు రాంబాబు, పోకల శివకుమార్, తూరుగొండ చిరంజీవి, జూలూరు వేణు, మంద యాదగిరి, నీల ఆగయ్య, కోట వెంకటయ్య, వెంకటయ్య, మణెమ్మ, స్వామినాథ్ పాల్గొన్నారు.

బీజేపీకి గుణపాఠం చెప్పాలి

స్టేషన్‌ఘన్‌పూర్: కేంద్రంలో పదేళ్ల పాలించిన బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసి దేశాన్ని సర్వనాశనం చేసిందని, ఆ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని సీపీఎం మండల కార్యదర్శి తోట రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యను గెలిపించాలని కోరుతూ మండలంలోని రంగరాయగూడెంలో సీపీఎం, కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం విస్తృతప్రచారం చేపట్టారు. గడపగడపకు తిరుగుతూ మహిళలకు బొట్టుపెడుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ మతతత్వ రాజకీయాలు చేస్తుందన్నారు. మోదీ పాలనలో పేదలు మరింత పేదలుగా మారారని, నిరుద్యోగ సమస్య తీవ్రంగా పెరిగిందన్నారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెబుతూ ఇండియా కూటమిలో భాగస్వామ్యపక్షమైన కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. మాజీ సర్పంచ్ అనూష, కాంగ్రెస్, సీపీఎం నాయకులు వెంకన్న, అజయ్‌రెడ్డి, నర్సింహులు, ఇలిషన్, కుమారస్వామి, రాములు, సురేష్ పాల్గొన్నారు.

కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలి

పాలకుర్తి: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర నాయకుడు కనకం రమేశ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో లీగల్ సెల్ నాయకులు చెరకు చంద్రశేఖర్, మధుసూదన్, కొండపాక కృష్ణ, ఎం.రవీంద్ర, చింత జోసఫ్ పాల్గొన్నారు.

కావ్యకు సీపీఎం సంపూర్ణ మద్దతు

జఫర్‌గఢ్: వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్, ఇండియా కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న కడియం కావ్యకు సీపీఎం సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి రాపర్తి సోమయ్య తెలిపారు. మండల కేంద్రంలో సీపీఎం, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి పార్టీ నాయకుడు గుండెబోయిన రాజు అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కావ్య గెలుపునకు కృషి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రచారంలో భాగంగా ఈ నెల 6, 7 తేదీల్లో చేపట్టనున్న ఇంటింటికి బొట్టు పెట్టే కార్యక్రమంలో తాము భాగస్వాములు కావడంతో పాటు కావ్య గెలుపునకు పాటుపడుతామన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి ఎండీ షబానా శంషోద్దీన్, సీపీఎం మండల కమిటీ సభ్యులు వడ్లకొండ సుధాకర్, నక్క యాకయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు అన్నెబోయిన భిక్షపతి, అన్నం బ్రహ్మారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నూకల ఐలయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

కావ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మహిళలతో కలిసి ఇంటింటా బొట్టు పెట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నెబోయిన భిక్షపతి, కుల్లా మోహన్‌రావు, ఎంపీటీసీలు జ్యోతి రజిత యాకయ్య, ఇల్లందుల స్రవంతి మొగిళి, మాజీ ఉప సర్పంచ్ నంచర్ల లత యాదగిరి, నీలం రాజయ్య, మంచాల అనిల్, నాయకులు కుక్కల సారంగం పాల్గొన్నారు.

కొడకండ్ల: కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని మహిళా కాంగ్రెస్ జిల్లా నాయకురాలు ధరావత్ రోజా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్‌నాయక్, యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేష్‌నాయక్ కోరారు. మొండ్రాయి, పాకాల, చెరువుముందుతండ, నీలిబండతండల్లో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీవర్ణ, శ్రీవాణి, శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పుల: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సుస్థిర పాలన సాధ్యమని టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణనాయక్ అన్నారు. మండలంలోని మాధాపురంలో కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోసం ఇంటింటా ప్రచారం చేపట్టారు. మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాసాచారీ, పంజాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ తరఫున దివ్యాంగుల వేదిక ర్యాలీ



జనగామ: కాంగ్రెస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తరఫున డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పిలుపు మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలో విజయ సంకల్ప యాత్ర–2 చేరుకున్న సందర్భంగా తెలంగాణ దివ్యాంగుల వేదిక అధ్యక్షుడు మేకల సమ్మయ్య ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ, ప్రచారం నిర్వహించారు. ర్యాలీలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న దివ్యాంగుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పూర్తి భరోసా ఉంటుందన్నారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వ హోం హాస్టళ్లు, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లను కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంలో ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ ఎప్పుడూ కూడా హాజరు కాలేదన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగ దివ్యాంగులు బొమ్మకంటి మహేందర్, రాగుల రామ్మోహన్ ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. పెరిక కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న గొప్ప నిర్ణయంతో వారి మద్దతు కాంగ్రెస్‌కే అన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల వేదిక జిల్లా అధ్యక్షుడు మేకల సమ్మయ్య, పెరిక కుల కార్పొరేషన్ సాధన సమితి అసోసియేట్ అధ్యక్షుడు కోట మల్లికార్జున్‌రావు, నాయకులు ఆంజనేయులు, ఐలేష్, రమేష్, నరసింహ, స్వరూప, మట్టి కిషన్, సత్యనారాయణ, ఎల్లయ్య, శ్రీనివాస్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఆదరించండి.. అభివృద్ధి చేస్తాం



బచ్చన్నపేట: ప్రచారం చేస్తున్న ప్రశాంత్‌రెడ్డి



జనగామ రూరల్: ప్రచారం చేస్తున్న నాయకులు

బచ్చన్నపేట: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని ఆదరించి గెలిపిస్తే రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేస్తారని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తనయుడు, యువ నాయకులు కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కట్కూర్, నాగిరెడ్డిపల్లి, పోచన్నపేట గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కిరణ్‌కుమార్‌రెడ్డిని ఎంపీగా గెలిపించుకుంటే రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అవుతారని, మళ్లీ ఇందిరమ్మ రాజ్యం వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ నిడిగొండ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, నాయకులు మాసపేట రవీందర్‌రెడ్డి, పుట్ట నర్సింహులు, వెంకటాచారి, పిట్టల శ్రీనివాస్, బిక్షపతి, మల్లయ్య, సతీష్, అభి గౌడ్, అజయ్, లక్ష్మయ్య, బుచ్చయ్య, చెంద్రయ్య, వెంకట్‌రెడ్డి, అశోక్, కిరణ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

చామలను గెలిపించండి..

జనగామ రూరల్: భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు కోరుతూ ఆదివారం మండలంలోని చీటకోడూర్, చౌడారం, మరిగడి, పెద్దతండా(ఎం) గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ప్రజా సంక్షేమం జరగాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని అన్నారు. ఆరు గ్యారంటీలు అమలుతో పాటు పేదలకు న్యాయం జరిగేలా మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అన్నారు. అత్యధిక మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. జిల్లా కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు ఇందిర, గోవర్దన్, నర్సింగరావు, కృష్ణస్వామి, సిద్దయ్య, బాలరాజు, సిద్దులు, కృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి'



స్టేషన్‌ఘన్‌పూర్: ప్రచారం చేస్తున్న నాయకులు



చిల్పూరు: ప్రచారం చేస్తున్న కృష్ణారెడ్డి



జఫర్‌గఢ్: ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే రాజయ్య

జఫర్‌గఢ్: బీఆర్‌ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సుధీకర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య కోరారు. మండలంలోని తిమ్మాపూర్, తీగారం, హిమ్మత్‌నగర్, సూరారం గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని రాజయ్య ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. పార్టీ మండల అధ్యక్షుడు పల్లెపాటి జైపాల్‌రెడ్డి, నాయకులు మహేందర్, రాజ్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రజా సంక్షేమం కోసం పాటుపడేది బీఆర్‌ఎస్సే

చిల్పూరు: ప్రజా సంక్షేమం కోసం ఎప్పటికీ పాటుపడేది బీఆర్‌ఎస్ పార్టీ ఒక్కటేనని రాష్ట్ర కార్యదర్శి ఎడవెల్లి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని మల్కాపూర్ గ్రామంలో ఆదివారం పార్టీ మండల కోఆర్డినేటర్ జనగామ యాదగిరి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వెన్నం మాదవరెడ్డి, బబ్బుల వంశి, మేడ్చల్ రమేష్, మంతెన రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

స్టేషన్‌ఘన్‌పూర్: బీఆర్‌ఎస్ ద్వారానే పేదలు, రైతులు, మహిళలు, కార్మికులు తదితర అన్ని వర్గాల అభ్యున్నతి సాధ్యమని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు అక్కినపెల్లి బాలరాజు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని కోరుతూ మండలంలోని తాటికొండ గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు చేసిన హామీలను విస్మరించి పేదల జీవితాలతో చెలగాటం ఆడుతుందని, ఇప్పటికే ప్రజలంతా కాంగ్రెస్ ప్రభుత్వంపై విసుగు చెందారన్నారు. బీజేపీ నేతలు మత విద్వేషాలతో రాజకీయాలు చేస్తున్నారని, పచ్చని పల్లెలో చిచ్చు పెడుతున్నారన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు పొన్న శ్రీను, నాయకులు జయపాల్‌నాయక్, పిడుగు రవి, మనోహర్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చిల్పూరు: సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు



జఫర్‌గఢ్: సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు

చిల్పూరు: మండలంలోని పల్లగుట్ట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000–2001 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు పసునూరి వెంకట్‌రెడ్డి, కొంతం యాదగిరి, బాసెట్టి హరిప్రసాద్, సమ్మయ్య, రంజిత్‌రెడ్డి, జయపాల్‌రెడ్డిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు శ్యాంసుందర్‌రెడ్డి, రాంబాబు, ఆంజనేయులు, సాదం వేణు, రఘుపతి, గవాస్కర్, రాజు, రాజేందర్, ఆనందం, సతీష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

కూనూర్‌లో..

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1998–99 టెన్త్ బ్యాచ్ పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం నాటి గురువులను శాలువలతో పాటు మెమోంటోలు అందజేసి సన్మానించారు. పూర్వ విద్యార్థులు పిట్టల కమలాకర్, అమరోజు శ్రీనివాస్, కే శోభారాణి, ఎండి పర్వీన్, పి మధు, అంజనేయులు, దర్శనాల జంపయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలి



మాట్లాడుతున్న సుందర్‌రామిరెడ్డి

దేవరుప్పుల: ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తాచాటేందుకు పార్టీ శ్రేణులు పాటుపడాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు పల్ల సుందర్‌రామిరెడ్డి పిలుపునిచ్చారు. సింగరాజుపల్లి బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీ సన్నాహక సమావేశానికి గ్రామ శాఖ అధ్యక్షుడు మేకపోతుల నర్సింహులు అధ్యక్షత వహించగా ఆయన మాట్లాడారు. కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ సాధన పునర్నిర్మాణం, రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమ పథకాలు వివరిస్తూ మన ప్రాంతంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు చేసిన అభివృద్ధిని ఇంటింటా అవగాహన కల్పించి మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తీరును ఎండగట్టాలని సూచించారు. పీఏసీఎస్ చైర్మన్ లింగాల రమేశ్ రెడ్డి గారు, వైస్ఎంపీపీ కత్తుల విజయకుమార్ రెడ్డి, గ్రామ ఇన్‌చార్జ్ సీనియర్ నాయకులు జోగు సోమ నర్సయ్య, మాజీ సర్పంచ్ మల్లేషమ్, ఎల్లప్ప ఉన్నారు.

గంగాదేవికి మొక్కులు



మొక్కులు చెల్లించుకుంటున్న యశస్వినిరెడ్డి

దేవరుప్పుల: మండలంలోని కడవెండిలో కొనసాగుతున్న గంగాదేవి ఉత్సవాల్లో ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కులదేవతను కొలిచే సామాజిక వర్గాలకు కోర్కెలు నేరవేరి ఆ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఉత్సవ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. అనంతరం అనారోగ్యానికి గురైన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొడగాని సోమనర్సోజీని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు డాక్టర్ ఎల్.లక్ష్మీనారాయణనాయక్, మాజీ మండల అధ్యక్షుడు, పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి, గ్రామ శాఖ అధ్యక్షుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇలవేల్పుల ఉత్సవాలతో సామాజిక వర్గాల ఐక్యత

ఇలవేల్పుల ఉత్సవాలతో ఆయా సామాజిక వర్గాల్లో ఐక్యతారాగం వర్ధిల్లుతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని కడవెండిలో గంగాదేవి ఉత్సవాల్లో ఆయన పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాలలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పల్ల సుందర్‌రావిరెడ్డి, మండల అధ్యక్షుడు తీగల దయాకర్, చింత రవి, బస్వ మల్లేషం, నక్క రమేష్, హన్మంతు, తాటిపెల్లి మహేశ్ ఉన్నారు.

ముగిసిన విజయదుర్గామాత ఉత్సవాలు



రఘునాథపల్లి: విజయదుర్గామాత



బచ్చన్నపేట: దుర్గామాతకు పూజ చేస్తున్న గ్రామస్తులు

రఘునాథపల్లి: మండల కేంద్రంలో మూడు రోజుల పాటు నిర్వహించిన విజయదుర్గామాత ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. శనివారం అర్ధరాత్రి ఊరుమ్మడిగా డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు ఊరేగింపుగా శివసత్తుల పూనకాలతో విజయ దుర్గామాత ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించారు. ఆదివారం ఉదయాన్నే డుబ్బులోళ్ల ఆలయం వద్ద గావు పట్టడంతో గ్రామస్తులు కోళ్ల, యాటలు బలిచ్చారు. మధ్యాహ్నం విజయ దుర్గామాతకు మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఒడి బియ్యం పోసి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. పాడిపంటలు సల్లంగా ఉండాలని దేవతను వేడుకున్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన భక్తులు దుర్గామాతను దర్శించుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొల్లం అజయ్, ఎంపీటీసీ పేర్ని ఉషారవి, మాజీ సర్పంచ్ పోకల శివకుమార్, మాజీ జెడ్పీటీసీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతకు ప్రత్యేక పూజలు

బచ్చన్నపేట: మండలంలోని బసిరెడ్డిపల్లి గ్రామంలో దుర్గామాత ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు అమ్మవారికి నాగబెల్లి నిర్వహించి మేక పిల్లను గావు పట్టగా గ్రామస్తులు మేకలను, గొర్రెలను కోసుకున్నారు. అనంతరం వ్యవసాయ బావుల వద్దకు వనభోజనాలకు వెళ్లారు. ఆలయం వద్ద బోనాలను తీసుకెళ్లి వ్యవసాయ పొలంలో చల్లారు. అలాగే అమ్మవారికి ఒడి బియ్యం పోసి చీర, రవికెలను కానుకగా సమర్పించారు. పలువురు నాయకులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఎలాంటి అల్లర్లు జరగకుండా ఎస్సై కంకల సతీష్‌కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



రఘునాథపల్లి: జనగామ పోలీస్‌స్టేషన్‌లో హోమ్ గార్డ్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారాల శ్రీనివాస్ కుటుంబానికి జనగామ పోలీసుల ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. ఏసీపీ అంకిత్‌కుమార్ ఆదివారం జాఫర్‌గూడెంలో జరిగిన శ్రీనివాస్ దశదినఖర్మలో పాల్గొని మృతుడి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుడి సతీమణికి ఏసీపీ రూ.1,35,000 సాయం అందజేశారు. కార్యక్రమంలో జనగామ సీఐ తిరుపతి, రఘునాథపల్లి ఎస్సై నరేశ్ పాల్గొన్నారు.